

బతుకమ్మ పాటల సీడీని ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కంజర్ల విజయలక్ష్మి

బతుకమ్మ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు: పొన్నం

బంజారాహిల్స్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): బతుకమ్మ వేడుకలు తెలంగాణ సంస్కృతికి అద్దం పడతాయని రాష్ట్ర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బంజారాహిల్స్ మంత్రుల నివాసంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకురాలు కంజర్ల విజయలక్ష్మి రూపొందించిన బతుకమ్మ పాటల సీడీని ఆదివారం ఆయన మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. ఆడబిడ్డలు సంతోషంగా ఉండాలనే ఉద్దేశ్యంతో చీరలు కూడా అందచేస్తున్నట్టు వెల్లడించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో గాయకుడు బోలే శవాలి, మాణుక రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎక్సైజ్ పోలీసులు

అక్రమ మద్యం రవాణాపై ఉక్కుపాదం

- 360 బాటిళ్లను సీజ్ చేసిన ఎక్సైజ్ పోలీసులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇతర రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు రవాణా అవుతున్న అక్రమ మద్యంపై ఎక్సైజ్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో రూ.14.50 లక్షల విలువైన 360 బాటిళ్లను సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. తనిఖీల్లో పాల్గొన్న డీటీఎఫ్ ఎక్సైజ్ సీఐ పవన్‌కుమార్‌ను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం, డిప్యూటీ కమిషనర్ దశరథ్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణప్రియ, ప్రవీణ్‌కుమార్‌లు అభినందించారు. స్వాధీనం చేసుకున్న మద్యం గోవా, హరియాణా, లక్నో ప్రాంతాల నుంచి దిగుమతి అవుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

దాండియా ఆటలు ఆడ..

హెచ్ఐసీసీలో నేటినుంచి 'సెలిబ్రిటీ దాండియా నైట్స్'



దాండియా ఆడుతున్న మోడల్స్

బంజారాహిల్స్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):హెచ్ఐసీసీలో సెప్టెంబరు 22 నుంచి సెలిబ్రిటీ దాండియా నైట్స్ జరుగనున్నాయి. హైదరాబాద్ మోడల్స్ ఆధ్వర్యంలో జరుగనున్న ఈ వేడుకలకు సంబంధించి జూబ్లీహిల్స్ లో ఫ్యాషన్ డైరెక్టర్ వంశీ పల్లే, ఫెమినా మిస్ ఇండియా ఛత్తీస్ గఢ్ స్పందనా పల్లి, వర్ధమాన నటి క్యాథలిన్ గౌడ, రాఘవి మీడియా ఎండి మధుబాబు దాండియా నైట్స్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ వేడుకల్లో సంప్రదాయం, సంగీతం, గ్లామర్, ఉత్సాహం కలగలిపి జరుగనున్నాయని వివరించారు. ఈ సందర్భంగా వంశీ పల్లే మాట్లాడుతూ, లైవ్ సంగీత బృందాల ప్రదర్శనలు, డీజే గర్బా ట్యూన్స్ ప్రదర్శనలు, సంప్రదాయ ఢోల్ తడ్కా, థీమ్ డెకరేషన్లు, సంప్రదాయ ఆహార వంటల స్టాల్స్‌తో పాటు సెలబ్రిటీల సందర్శనలు కూడా ఉంటాయని వివరించారు.



కార్డియాక్ రిహబ్ రన్‌ను ప్రారంభిస్తున్న అపోలో ఆస్పత్రుల తెలంగాణ సీఈవో తేజస్వీరావు తదితరులు

నెక్లెస్‌రోడ్‌లో కార్డియాక్ రిహబ్ రన్..

ఖైరతాబాద్, సెప్టెంబరు21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆరోగ్యసంస్థ క్లాస్ 1ఎ సిఫారసు చేసిన కార్డియాక్ రిహాబ్‌లు మనదేశంలో సరిగ్గా వినియోగించడంలేదని అపోలో ఆస్పత్రి సీనియర్ కార్డియాలజిస్ట్ రాజీవ్ గార్గ్ అన్నారు. గుండెపోటు నివారణకు వ్యాయామం, జీవనశైలిలో మార్పుల అవసరంపై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో అపోలో ఆస్పత్రి హైదర్‌గూడ, కార్డియాక్ రిహాబ్ ఫౌండేషన్ సహకారంతో కార్డియాక్ రిహాబ్ రన్ నిర్వహించారు. ఇందులో ఫిట్‌నెస్ ప్రియులు, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, పలువురు గుండె వ్యాధితో బాధపడుతున్న వారు పాల్గొని అనుభవాలను వివరించారు. కార్డియాక్ రిహాబ్ ద్వారా ఇప్పటికే తమ ఆస్పత్రిలో దాదాపు 120 మంది రోగులకు ప్రయోజనం చేకూరిందన్నారు. ఇందులో అపోలో ఆస్పత్రుల తెలంగాణ సీఈఓ తేజస్వీరావు, రీజనల్ సీఈవో రాచపల్లి రెడ్డప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కోహినూర్ కమ్యూనిటీలో చిన్నారుల చిందులు

నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

హైటెక్ సిటీ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): హైటెక్ సిటీ కోహినూర్ కమ్యూనిటీ ప్రాంగణంలో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం బాలికలంతా భక్తి శ్రద్ధలతో నృత్యం చేస్తూ ఆడి పాడి అలరించారు. కమ్యూనిటీలోని నివాసులంతా వేడుకల్లో పాల్గొని చిందులేశారు. చిన్నారులు సంప్రదాయ తెలుగు వేషధారణలో నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.



పప్పీ దత్తత మేళా

వీధి కుక్కల నియంత్రణలో భాగంగా జీహెచ్ఎంసీ ప్రయోగాత్మకంగా చేపట్టిన ఇండి పప్పీ దత్తత మేళా కొనసాగుతోంది. ఆదివారం కేబీఆర్ పార్కులో 27 దేశీ కుక్క పిల్లలను ప్రదర్శించగా.. ఆసక్తి ఉన్న వారు 16 కుక్క పిల్లలను దత్తత తీసుకున్నారు.

అవ్వా.. నీ ఓటు నాకే!

ఒక్క పైసా కట్టొద్దు.. డబుల్‌బెడ్‌రూం ఇప్పిస్త

ప్రచారంలోనే రేషన్ కార్డులకు దరఖాస్తులు
బస్తీ ఓటర్లను ఆకర్షించేందుకు పాట్లు
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల కోసం హామీలు గుప్పిస్తున్న నేతలు

బంజారాహిల్స్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):

అవ్వా మంచిగున్నవా.. మస్తు దినాలైంది నీ దగ్గరకు రాక.. పింఛన్లు వస్తున్నయా.. అయ్యో గీ గుడిసె ఏందీ గిలా అయింది..

ఏం చేయాలే బిడ్డ, గరీబు దాన్ని వచ్చే పింఛను బువ్వకే సరిపోతలే ఇక గుడిసె ఎట్లా కప్పిచ్చుకోవాలే...

గందుకే అవ్వా నీకు సొంత ఇళ్లు కట్టుకునేందుకు నేను సాయపడతా. ఒక్క పైసా కూడా కట్టొద్దు. సర్కారోళ్లు బెడ్‌రూం కట్టి నీకు ఇస్తరు. అందులో మస్తు సౌలత్‌లు ఉంటయ్..

గదేంది బిడ్డా పోయినేడు కూడా గిట్లనే చెప్పి ఫారాలు నింపించుకుంటివి.. గాని ఇప్పటికి ఇళ్లు రాలేదు.. మళ్లా గదే ముచ్చట చెపుతున్నవేందీ...

లేదవ్వ ఈ సారి ఎట్లైనా ఇళ్ల నిర్మాణం చేస్తం.. గది చెప్పనీకా నీ దగ్గరకు వచ్చినా.. గీ ఫారం మీద సంతకం పెట్టు..

అబ్బా ఎంత మంచోడివి బిడ్డా నాకు ఇళ్లు ఇప్పిస్తున్నవ్

గీయింత సేయక పోతే ఎట్ల చెప్పు.. అది సరే గాని అవ్వా వచ్చే నెల ఓట్ల పండుగ ఉంది అందులో నాకే ఓటేయాలి. నీ కోసం గుడిసె కాడికే కారు పంపిస్తా మరిచిపోకు...

ఓర్నీ ఎలచ్చన్లు వచ్చినయా గందుకే నా మీద ప్రేమ సూపిస్తునావ్.. ఓటు అడుక్కోవడానికి ఇళ్లు అంటూ ఆశ పెట్టినవ్ నీకు నేనే ఎయ్యపో....

సర్కారు నీ ఒంటి పేదోళ్ల కోసమే గీ పథకం తెచ్చింది. నేను దగ్గరుండి నీకు ఇప్పిస్తా.. ఓటు నాకే యేయి. నిధులు మేమే ఇస్తున్నాం.

డబుల్ బెడ్‌రూంల నిధులు మేమేఇచ్చినం.. పేదోళ్ల కోసం మా సర్కారే అన్ని పథకాలకు పైసలు ఇస్తుంది.. మీరందరు మాకే ఓటు ఎయ్యాలా..

గదేంది సారు గిప్పుడే వేరే పార్టీ లీడర్‌లు వచ్చి ఇళ్లు ఇస్తమని కాగితం మీద రాసుకొని పోయింర్రు కదా..

అరే అవ్వా వాళ్లు ఎట్లా కాగితం రాయించుకుంటరు.. అన్నింటికి పైసలు మా సర్కారే ఇస్తుంది. ఇత్తే గిత్తే మేమే ఇళ్లు ఇయ్యాలే. వాళ్లు ఎట్ల ఇస్తరు. గీ కాయితం మీద నీ పేరు నింపు. మేమూ మా పెద్ద సార్లకు పంపిస్తం.. సరేగాని ఎలచ్చనల్లో మా పార్టీకే ఓటు వేయాలే.. గుర్తు తెలుసుకదా.

మరోపార్టీ..

నిరుడు మేమే అధికారంలో ఉన్నప్పుడు పేదోళ్ల కోసం మస్తు చేసినం.. అందరూ సొంత ఇళ్లలో ఉండాలని పథకాలు చేసినం...బస్తీలో పెద్ద పెద్ద భవంతులు కట్టి అందులో పేదోళ్లను ఉంచాలనుకున్నం.. ఇందుకోసం పైసలు కూడా రెడీ చేసినం.. ఇప్పుడుగా పైసలతోనే గీ సర్కారోళ్లు ఇళ్లు కట్టిస్తమంటరు.. సొమ్మొకడిది....సోకొకరి లెక్క..

అయ్యో సారు ఇళ్ల కోసం పైసలు మీరిచ్చింర్రా.. మరీ వాళ్లు మేమే అని సెప్పిండు...


అవ్వా అలాంటోళ్లను సూసి మోసపోకు మేమే నీకు న్యాయం చేయగలం.. ఇదిగో గీ ఫారం మీద నీ పేరు రాసి సంతకం పెట్టు అన్ని నేనే సూసుకుంటా.. ఇగ ఓటు మాత్రం మాకే ఎయ్యాలే సూడు.

ఎలచ్చన్ల సోకులే..

సూచినవా అవ్వా ఓట్ల కోసం వస్తే మనం పోయినేడు సెప్పిన బాధలు తీర్చలేదు మల్లా ఎందుకు వచ్చారని అడుగుతామని.. లీడర్లు ఇళ్లు అంటూ మన దగ్గరకు వస్తున్నారు.

అవునే మనవరాలా.. నేను పుట్టి పెరిగినప్పటి నుంచి గీ బస్తీలో మారింది ఏం లేదు గలీజు డ్రైనేజీ, గుంతలు పడ్డ రోడ్లే గప్పుడు ఎట్లున్నయో గిప్పుడూ అట్లనే ఉన్నయ్. ఎలచ్చన్లు వచ్చినయంటే నాయకులు వస్తరు పోతరు కానీ మన గురించి పట్టించుకోరు. ఏమన్నా అంటే ఎలచ్చన్లు కదా ఖుషీ చేసుకోమని పైసలు ఇస్తరు.

అవును అవ్వా ఏదో లెక్కన మనం ఓట్లు ఎయ్యాలే అని ముచ్చట్లు చెప్తరు.. కాని ఏం సేయరు. గీ దీన్నే ఎలచ్చన్ల స్టంటు అంటరట..



బంజారా రిజర్వేషన్ల స్వర్ణోత్సవ వేడుకలు



పీవీఆర్ మార్గ్‌లోని ఇందిర విగ్రహం వద్ద నాట్యం చేస్తున్న బంజారా మహిళలు



మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్

ఖైరతాబాద్, సెప్టెంబరు21 (ఆంధ్రజ్యోతి): బంజారాలు రాజ్యాంగపరంగా రిజర్వేషన్లు పొంది 50 సంవత్సరాలు గడుస్తున్న సందర్భంగా బంజారా హేరత్ ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించారు. ఆదివారం నెక్లెస్‌రోడ్ రోటరీ చౌరస్తాలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి రవీంద్ర నాయక్, బంజారా భారత్ చైర్మన్ జగన్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఇందిరా జ్యోతిని వెలిగించి మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి నివాళులర్పించారు. తెలంగాణ ఇచ్చిన సోనియాకి, ఎస్టీ రిజర్వేషన్లు 6 నుంచి 10 శాతానికి పెంచడంలో సహకరించిన రాహుల్, సీఎం రేవంత్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, రాంచందర్‌నాయక్, మంత్రి వివేక్, మహేష్‌కుమార్ గౌడ్, బలరాం నాయక్, ఎమ్మెల్యే బాలునాయక్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ పాల్గొన్నారు.

ఘనంగా ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు



వెంగళరావునగర్ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప మైదానంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, సంక్షేమ సమితి ప్రతినిధులు



శిల్పారామంలో ఆడుతున్న మహిళలు

హైటెక్ సిటీ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): శిల్పారామంలో బతుకమ్మ, దసరా ఉత్సవాలు, సారీస్ ఆఫ్ ఇండియా మేళాలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు కథక్, కూచిపూడి నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. ఆదివారం అర్చన మిశ్రా శిష్య బృందం కథక్ నృత్యంలో గణేశ వందన, గురు వందన, కృష్ణ వందన, తీన్తాల్, తరణ, సర్గం, చతురంగ్ అంశాలను స్వాతి, జాహ్నవి, నిహారిక, మీతు, అధిర, రుచిత, ధ్రువ, ఆనందిని, శ్రీకా, సర్వాణి, ఆకాంక్ష, సంజన, లిప్సిత, సౌందర్య తదితరుతు ప్రదర్శించారు. కూచిపూడి నృత్యంలో సౌందర్య కౌశిక్ తన శిష్య బృందం చే బొమ్మ బొమ్మత, శరణం భవ, జయ జయస్వామి, చక్కని తల్లికి, అలరులు కురియగా, జయ జయ వైష్ణవి, అంశాలను శ్రేష్ఠ తదితరులు ప్రదర్శించారు. శిల్పారామం ఆవరణలో మహిళా సిబ్బంది రంగు రంగుల పూలతో బతుకమ్మలను పేర్చి సందర్శకులతోపాటు ఆట, పాటలతో అలరించారు.



శిల్పారామంలో మహిళల నృత్య ప్రదర్శన



బంజారాహిల్స్: వెంకటగిరి యూత్, డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలో మహిళలు

శీతల పానీయం అనుకొని యాసిడ్ తాగిన వ్యక్తి మృతి

యూసుఫ్ గూడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శీతల పానీయం అనుకొని యాసిడ్ తాగి ప్రమాదవశాత్తు వ్యక్తి మరణించిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన సుశాంత కుమార్ సాహు(43) ఉపాధ్యాయుడు. రహమత్ నగర్‌లో నివసిస్తున్నాడు. ఈ నెల 19న మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం భార్యని శీతల పానీయం అడిగగా వంటగదిలో ఉంది తీసుకొని తాగమని చెప్పింది. యాసిడ్ బాటిల్‌ని అదే అనుకొని తాగేశాడు. తెలుసుకుని వెంటనే ప్రాథమిక చికిత్స తీసుకొని, అమీర్ పేట లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడని భార్య సుమిత్రా సాహూ పోలీసులకు సమాచారం అందించింది.

బల్కంపేట ఆలయంలో ఆన్‌లైన్ సేవలు ప్రారంభం

అమీర్‌పేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్న బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో ఎట్టకేలకు ఆన్ లైన్ టికెట్ సేవలు ప్రారంభమయ్యాయి. డబుల్ సిరీస్ నంబర్లతో సిబ్బంది నకిలీ టికెట్లు విక్రయిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో అక్రమాలకు తావులేకుండా ఉండేందుకు గాను దేవాదాయ శాఖ అధికారులు ప్రసాదం పులిహోర, చక్కెర, బెల్లం, వడ, అభిషేకం లడ్డూల విక్రయానికి ఆలయ ప్రాంగణంలో ఆన్ లైన్ టికెట్ కౌంటర్‌ను ప్రారంభించారు. కాగా చక్కెర లడ్డూకు రూ.20, బెల్లం లడ్డూకు రూ.25, పులిహోర ప్యాకెట్ కు రూ.20, అభిషేకం లడ్డూ విక్రయానికి రూ. 100గా నిర్ణయించి భక్తులకు విక్రయిస్తున్నారు. ఈ ఆన్ లైన్ కౌంటర్ ను ఆదివారం కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ ఆదేశాల మేరకు ధర్మకర్తలు సందర్శించి ఆన్ లైన్ టికెట్ కౌంటర్ ను పరిశీలించారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయం ముస్తాబు

భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా సకల ఏర్పాట్లు

అమీర్‌పేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సోమవారంనుంచి అంగరంగా వైభవంగా ప్రారంభం కానున్న శ్రీ దేవి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు బల్కంపేట ఎల్లమ్మ ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా సకల ఏర్పాట్లు చేసినట్లు ఈవో టి.శేఖర్, ఆలయ చైర్మన్ సాయిబాబా గౌడ్‌లు వెల్లడించారు. ఆదివారం స్థానిక ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

'నా భర్త ఆచూకీ తెలపండి'

యూసుఫ్ గూడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వ్యాపార పనుల నిమిత్తం చెన్నైకి వెళ్లి తిరిగి రాని భర్త ఆచూకీ తెలపండని భార్య ఫిర్యాదు చేసిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి కూడా, అంబేద్కర్ నగర్ కు చెందిన కరుణాకర్ రావు షేర్ మార్కెట్ వ్యాపారి. ఆగస్టు 8న వ్యాపారం పనుల కోసం తమిళనాడు వెళ్లాడు. ఈ నెల 4న ఫోన్‌లో మాట్లాడి 16న ఇంటికి వస్తానని చెప్పి తిరిగి రాక పోవడంతో ఆదివారం భార్య శిరీష మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

కుక్కల దాడిలో గాయాలు



నరసింహ చేతిని కొరికిన కుక్కలు

అమీర్‌పేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బల్కంపేటలో వీధి కుక్కలు రోజురోజుకు చెలరేగిపోతున్నాయి. ఈ దారిలో వెళ్లాలంటే పాదచారులు వణికిపోతున్నారు. ఒకే వ్యక్తిని వారంలో రెండు సార్లు కరిచి భయభ్రాంతులకు గురిచేశాయి. ఆదివారం ఉదయం 9 గంటలకు టీకేగూడ పార్క్ నుంచి వార్డు ఆఫీస్ ముందు నుంచి నడుచుకుంటూ వస్తున్న విశ్రాంత రిటైర్డ్ ఉద్యోగి నరిసింహను ఎగబడి కుక్కలు కుడిచేతి కండను కొరికి వేశాయి. దీంతో భయందోళనకు గురైన నరిసింహ పరుగులు తీసినప్పటికి వదలలేదు ఇది గమనించిన స్థానికులు ఆ కుక్కలను తరిమి కొట్టారు, దీంతో ప్రాణాపాయం నుంచి ఆయన బయట పడ్డాడు.



జహీరా గుల్షన్ బాగ్‌లో బూత్ స్థాయి కమిటీ సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి పెరుమాళ్ విశ్వనాథన్, తదితరులు



కళ్యాణ్ నగర్ వెంచర్ త్రీ లో బూత్ స్థాయి సమావేశంలో కార్పొరేషన్ల చైర్మన్లు గుత్తా అమిత్ రెడ్డి వెంకటరమణారెడ్డి

కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ఏఐసీసీ కార్యదర్శి, జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఇన్‌చార్జి పెరుమాళ్ విశ్వనాథన్

ఎర్రగడ్డ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని ఏఐసీసీ కార్యదర్శి, జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఇన్‌చార్జి పెరుమాళ్ విశ్వనాథన్ అన్నారు. ఆదివారం ఎర్రగడ్డ డివిజన్లోని పలు బస్తీలలో ఆయన పర్యటించారు. అనంతరం జహీరా గుల్షన్ బాగ్‌లో ఏర్పాటు చేసిన బూత్ స్థాయి నాయకులతో సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్ల నియోజకవర్గంలోని ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎర్రగడ్డ డివిజన్‌లోని కళ్యాణ్ నగర్ వెంచర్ త్రీలో ఏర్పాటు చేసిన బూత్ స్థాయి సమావేశంలో తెలంగాణ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు గుత్తా అమిత్ రెడ్డి, వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ జూబ్లీహిల్స్‌లో రాబోయే ఉప ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఇతర పార్టీలకు చెంపపెట్టు కావాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సిఎన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు నవీన్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి రవి గౌడ్, నాయకులు, రమేష్ నాయక్, ఇమ్రాన్ ఖాన్, సిద్ధిక్, రషీద్, తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌ని తీర్చిదిద్దింది గోపీనాథే : మాగంటి సునీత



ఎర్రగడ్డ డివిజన్‌లో పర్యటిస్తున్న బీఆర్ఎస్ నాయకురాలు

ఎర్రగడ్డ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఉండి జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని మాగంటి గోపీనాథ్ ఆదర్శవంతంగా తీర్చిదిద్దారని ఆయన సతీమణి మాగంటి సునీత అన్నారు. ఆదివారం ఎర్రగడ్డ డివిజన్లోని పలు బస్తీలలో ఆమె పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. హేమవతి నగర్, శాస్త్రి నగర్ తదితర బస్తీలలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాగంటి గోపీనాథ్ ప్రజా శ్రేయస్సు కోసం ఎంతో తపనపడే వారిని, ఎప్పుడూ ప్రజల కోసమే ఆలోచించే వారన్నారు. ప్రజలకు ఆయన లేని లోటు తీర్చడానికి మేము ప్రజలకు ఎప్పుడు అండగా ఉంటామని ఆమె భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎర్రగడ్డ డివిజన్ టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సంజీవ, ప్రధాన కార్యదర్శి షరీఫ్, నాయకులు మహమ్మద్ అజీమ్, డివిజన్ మహిళా అధ్యక్షురాలు కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలే పరిశ్రమ ప్రగతికి పునాది: వీకే మిశ్రా



వీకే మిశ్రాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సాకేత్ టీకూ

హైటెక్ సిటీ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : భద్రతా ప్రమాణాలే పరిశ్రమకు ప్రగతికి బలమైన పునాది అని పెట్రోలియం ఎక్స్ ప్లోసివ్స్ సేఫ్టీ ఆర్గనైజేషన్ జాయింట్ చీఫ్ కంట్రోలర్ ఆఫ్ ఎక్స్ ప్లోసివ్స్ వీకే మిశ్రా అన్నారు. ఆలిండియా ఇండస్ట్రియల్ గ్యాసెస్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ 50వ వార్షికోత్సవం ఆదివారం మాదాపూర్ వెస్టిన్ హోటల్లో ఇండస్ట్రియల్, మెడికల్ గ్యాస్పై భద్రతా సదస్సు జరిగింది. సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కోవిడ్ వంటి సంక్షోభ సమయంలోనూ పరిశ్రమలు చేసిన సేవలు అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా వీకే మిశ్రాను మాన్యు ఫాక్చర్ అసోసియేషన్ అధ్యక్షుడు సాకేత్ టికూ, జనరల్ సెక్రటరీ రాజీవ్ గుప్తా సత్కరించారు.

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

ముస్తాబైన బౌద్ధనగర్ కనకదుర్గ ఆలయం




బౌద్ధనగర్‌లోని కనకదుర్గ ఆలయం, ప్రత్యేక అలంకరణలో కనకదుర్గ అమ్మవారు

బౌద్ధనగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గంలో బౌద్ధనగర్‌లో కనకదుర్గ ఆలయంను దేవీ శరన్నవరాత్రోత్సవాలకు ముస్తాబు చేశారు. కనకదుర్గ ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలకరించారు.గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న దేవాలయాల్లోనే ఆ ఆలయం ప్రముఖంగా పేరు ప్రఖ్యాతలు పొందింది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తుంటారు.

ఆలయ చరిత్ర

కనకదుర్గ ఆలయానికి వంద సంవత్సరాల చరిత్ర ఉంది. వంద సంవత్సరాల క్రితం బౌద్ధనగర్‌లోని ఓ వేపచెట్టు క్రింద పోచమ్మ, మైసమ్మ అమ్మవార్లు స్వయంగా వెలిశారు. అప్పట్లో స్థానికులు ఈ ప్రాంతంలో చిన్నపాకను ఏర్పాటు చేసి తర్వాత ఆలయాన్ని అభివృద్ధి చేశారు. 1992లో ఆలయ చైర్మన్ కొట్ట ధరణీధర్ చేతులు మీదుగా వేదపండితుల మంత్రోచ్చారణలతో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి బౌద్ధనగర్ కనకదుర్గ ఆలయంగా పిలుస్తున్నారు. ఈ ఆలయంలో వరలక్ష్మీవ్రతాలు, ప్రత్యేక పూజలు, కుంకుమార్చన పూజలు నిర్వహిస్తామని ప్రధాన అర్చకులు శ్రీనివాస్‌పంతులు తెలిపారు.

ఉత్సవాలు ప్రారంభం

సోమవారం నుండి కనకదుర్గ ఆలయంలో దసరా ఉత్సవాలు ప్రారంభమై అక్టోబరు 2 వరకు కనులపండువగా జరగనున్నాయి. కుంకుమార్చన పూజలతో పాటు, లలిత సహస్ర పారాయణం, హోమాలు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. పదిరోజుల పాటు కనకదుర్గ అమ్మవారు వివిధ ప్రత్యేక అలంకరణల్లో దర్శనం ఇవ్వనున్నారు.

తిరుమలగిరిలో..

బొల్లారం తిరుమలగిరిలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు దేవాలయాలను నిర్వాహకులు ముస్తాబు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. బొల్లారం డౌటన్‌బజార్‌లోని తోట ముత్యాలమ్మ దేవాలయాన్ని నిర్వాహకులు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. నవరాత్రుల్లో భాగంగా సోమవారం మొదటిరోజు అమ్మవారు బాల త్రిపుర సుందరీ దేవి అలంకారంతో దర్శనం ఇవ్వన్నారు. అదేవిధంగా అక్టోబర్ 2వ తేది విజయదశమిని పురస్కరించుకుని ముత్యమాంబదేవి దివ్య దర్శనం జరుగుతుందని తెలిపారు. బొల్లారం డౌటన్ బజార్‌లోని దేవాదాయ ధర్మాదాయశాఖకు చెందిన శ్రీ హనుమాన్ దేవాలయం ప్రాంగణంలో ఉన్న లలితా త్రిపుర సుందరీదేవి ప్రథమ వార్షికోత్సవం, నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయని ఆలయం ఈఓ మహేందర్ రెడ్డి, దేవాలయం వ్యవస్థాపకులు పరుశనిరంజన్ లు తెలిపారు.



బొల్లారంలోని తోట ముత్యాలమ్మ దేవాలయం

ఘనంగా నిర్వహిస్తున్నాం



ఆలయంలో పదిరోజుల పాటు దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నాం. ప్రతిరోజు ఆలయంలో సాయంత్రం కనకదుర్గ అమ్మవారికి సహస్ర నామార్చన, పల్లకీ సేవ, సంగీతసేవ, చతుర్వేద సేవలు నిర్వహిస్తున్నాం. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాటు చేశాం. కనకదుర్గ అమ్మవారికి సేవ చేసుకునే అవకాశం కలిగినందుకు ఆనందంగా ఉంది.

- కొట్ట ధరణీధర్, ఆలయ చైర్మన్

'నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి'

బౌద్ధనగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రోత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని వారాసిగూడ పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ అరకల మధుసూదన్‌రెడ్డి సూచించారు. పోలీస్‌స్టేషన్‌లో దుర్గామాత మండపాల కమిటీ నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని, తాత్కాలికంగా సీసీ కెమెరాలను ఏర్పాటుచేసుకోవాలన్నారు. శాంతిభద్రతలు ఉల్లఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో అడ్మిన్ ఎస్సై సుధాకర్, ఎస్సైలు సునీతా, మల్లికార్జున్, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని చిలకలగూడ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అనుదీప్ మండప నిర్వాహకులకు సూచించారు. ఆదివారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో దుర్గా మండప నిర్వాహకులతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. సమావేశంలో ఎస్సైలు, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

'రైల్వే పోర్టర్ల సమస్యలను పరిష్కరించాలి'

బౌద్ధనగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ పెన్షన్‌దారులు, రైల్వే పోర్టర్ల సమస్యలను పరిష్కారించాలని విశ్రాంత సీనియర్ రైల్వే అధికారి, రైల్వేపోర్టర్ల సంఘం ప్రధాన సలహాదారు, కేంద్ర ప్రభుత్వ పెన్షన్‌దారుల సంఘం నాయకుడు ఆర్‌వీఎస్ రాఘవరావు నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్(ఎన్ఎఫ్ఐఆర్) ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్యను కోరారు. ఆదివారం చిలకలగూడ సంఘ్ కార్యాలయంలో ఆర్‌వీఎస్ రాఘవరావు మర్రి రాఘవయ్యను కలిసి ఘనంగా సత్కరించారు. ఎన్ఎఫ్ఐఆర్ జాతీయ సదస్సులో మర్రి రాఘవయ్య మరోసారి ప్రధానకార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావటం సంతోషకరమన్నారు. కేంద్ర ప్రభుత్వ, విశ్రాంత రైల్వే ఉద్యోగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

యువత క్రీడల్లోనూ రాణించాలి : ఎమ్మెల్యే



క్రీడాకారులతో ఎమ్మెల్యే శ్రీగణేష్

తిరుమలగిరి సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బొల్లారంలోని కంటోన్మెంట్ పబ్లిక్‌గ్రౌండ్స్‌లో గార్డెన్ ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో ఛాంపియన్స్ కప్ సీజన్-1 టోర్నమెంట్‌ను ఆదివారం నిర్వహించారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ఫైనల్ మ్యాచ్‌ను తిలకించి టోర్నమెంటు విన్నర్స్ బ్రాలర్స్ టీంకు ట్రోఫీతో పాటు రూ.10 వేల నగదు బహుమతులు, ఉత్తమ ప్లేయర్, ఉత్తమ స్ట్రైకర్, ఉత్తమ డిఫెండర్ ట్రోఫీలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలని, క్రీడలు ఆరోగ్యానికి కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ఇలాంటి టోర్నమెంట్‌లు నిర్వహించిన నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందిస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో కంటోన్మెంటు బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జయప్రకాష్, బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, నర్సింహన్, కదిరవన్, ప్రేమ్, శ్యామ్, హయత్ తదితరులు పాల్గొన్నారు.

అన్నానగర్‌లో కార్పొరేటర్ పర్యటన

బౌద్ధనగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ అన్నానగర్‌లో స్థానిక కార్పొరేటర్ డాక్టర్ సామల హేమ ఆదివారం పర్యటించారు. రెండురోజుల క్రితం కురిసిన భారీవర్షానికి నాలా గోడ కూలిందని స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. ఆమె సంబంధిత అధికారులతో మాట్లాడి కూలిన నాలా గోడ నిర్మాణం చేపట్టారు. అనంతరం స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీ, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు



మహాలయ అమావాస్య సందర్భంగా బోయినపల్లి చిన్నతోకట్ట మైసమ్మ తల్లి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలకు కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ హాజరయ్యారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. బోయినపల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టి.ఎన్.శ్రీనివాస్ పాల్గొన్నారు. - సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి

అల్పాహారం పెట్టాకే పిల్లల్ని బడికి పంపండి

● డిప్యూటీ ఐఓఎస్ మదన్‌మోహన్ రెడ్డి

అడ్డగుట్ట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ బడులకు వెళ్లే విద్యార్థులకు తల్లిదండ్రులు ఉదయాన్నే అల్పాహారం పెట్టిన తర్వాత బడికి పంపాలని మారేడుపల్లి డిప్యూటీ ఐఓఎస్ అధికారి మదన్‌మోహన్‌రెడ్డి తల్లిదండ్రులకు సూచించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పేరెంట్స్ కమిటీ సమావేశంలో ఆయన పదవ తరగతి విద్యార్థులు, టీచర్లతో అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు పనికి వెళ్లే తొందరలో ఉండి పిల్లలు తిన్నారా లేదా అని గమనించకపోవడంతో వారు ఎలాంటి ఆహారం తినకుండా బడికి రావడంతో విద్యార్థులు నీరసంగా కనిపిస్తున్నారన్నారు. దీంతో విద్యార్థులు చదువుపై ధ్యాస పెట్టలేకపోతున్నారని ఆయన తల్లిదండ్రులకు గుర్తుచేశారు. అందుకే పిల్లల కడుపులో కొంత ఆహారం ఉన్నట్లయితే చదువులో మేధాశక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్లు ఆశాకుమారి, కృష్ణమూర్తి, పద్మావతి, సత్యనారాయణ, రజిని, సురేష్ కుమార్, జయశ్రీ, రాజేశ్వరి, శ్రీవాణి, నవీనా, విమల, విజయలక్ష్మి, పద్మ, జగన్నాథం, నర్సింహాచారీ, కామేశ్వరి, వేణుగోపాల్‌తో పాటు పేరెంట్స్ కమిటీ సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా జగన్‌రెడ్డి



బౌద్ధనగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చిలకలగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా జగన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. సంతోష్‌నగర్ పీఎస్‌లో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన ఆయన బదిలీపై చిలకలగూడ ట్రాఫిక్ పీఎస్‌కు వచ్చారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామని, నిర్దిష్టమైన ప్రణాళికతో ముందుకు సాగుతామని తెలిపారు. ఇక్కడ పనిచేసిన ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.శ్రీనివాసులు గోపాలపురం పీఎస్‌కు డీఐగా బదిలీపై వెళ్లారు.



బాపూజీ నగర్ నల్లపోచమ్మ ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న జంపన ప్రతాప్

నల్లపోచమ్మ ఆలయంలో అన్నదానం

బోయినపల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మహాలయ అమావాస్య రోజు అన్నదానం నిర్వహించడం ఎంతో విశిష్టమైనదని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం బోయినపల్లి బాపూజీనగర్‌లోని నల్లపోచమ్మ ఆలయంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. అనంతరం జయనగర్ గజ్జల భారతమ్మ, హరికిషన్ రెడ్డి, మిఠాయి శ్రీనివాస్ రెడ్డిల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమానికి సహకరించిన సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆయన వారిని ఘనంగా సత్కరించారు. అనంతరం జయనగర్ పోచమ్మ తల్లి ఆలయం, చిన్నతోకట్ట కట్ట మైసమ్మ ఆలయంలో అన్నదాన కార్యక్రమాల్లో జంపన పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, వ్యాపారవేత్త ప్రకాష్ భాటియా, ఆలయ కమిటీ సభ్యులు ప్రేమ్ ముదిరాజ్, రామారావు, దుర్గయ్య, శ్రీకాంత్, నర్సింహ, మారుతి గౌడ్, క్రాంతి, సాయి, విఠల్ రావు, శ్రీనివాస్ గౌడ్, రాము, ఈనిష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరిలో..

అమావాస్యను పురస్కరించుకుని ఆదివారం లాల్‌బజార్‌లోని మహంకాళి దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకం, అర్చన, కుంకుమార్చన, పుష్పార్చన లాంటి ప్రత్యేక పూజలు చేసి, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో యశ్వంత్ కుమార్, ప్యారసాని రాజు, రాజా రెడ్డి, ఉమేష్, అనురాధ రెడ్డి, పద్మావతిలు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురాలు

బోయినపల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : బతుకమ్మ, దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని బోయినపల్లిలోని సీఎంఆర్ హైస్కూల్‌లో బతుకమ్మ, దసరా సంబరాలను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న సీఎంఆర్ విద్యాలయాల చైర్మెన్ సీహెచ్ గోపాల్‌రెడ్డి, పాఠశాల డైరెక్టర్ ఎస్‌కె రెడ్డితో కలిసి వేడుకలు ప్రారంభించారు. రకరకాల పూలతో తయారుచేసిన బతుకమ్మలను పాఠశాలకు తీసుకువచ్చిన విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి పాటలు పాడుతూ సంబరాలు చేసుకున్నారు. అనంతరం సమీపంలో ఏర్పాటు చేసిన కొలనులో, నీటి తొట్లలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి సంబురాల్లో సీఎంఆర్ విద్యాలయాల చైర్మన్ సీహెచ్. గోపాల్ రెడ్డి, పాఠశాల డైరెక్టర్ ఎస్‌కె.రెడ్డి



అడ్డగుట్ట ఇందిరాలక్ష్మినగర్ బస్తీలో బతుకమ్మ ఆడుతున్న చిన్నారులు, మహిళలు



అడ్డగుట్ట శాస్త్రీనగర్ బస్తీలో ఎంగిలిపువ్వు బతుకమ్మ ఆడుతున్న మహిళలు

బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం : హరీష్‌రావు

వరద బాధితులకు నిత్యావసరాల అందజేత



నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న హరీష్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లు

రాంగోపాల్‌పేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు విమర్శించారు. ఇటీవల కురిసిన వర్షాలకు రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఇళ్లలోకి వరదనీరు వచ్చి చేరగా సుమారు 1500 కుటుంబాలు నష్టపోయాయి. ఆ కుటుంబాలకు సనత్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిత్యావసరాల పంపిణీ కార్యక్రమంలో ఆదివారం హరీష్‌రావు పాల్గొని బాధితుల ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ సీఎం వరద బాధితులకు ఒక్కపైసా సహాయం చేయలేదని, నగరంలో ఏడెనిమిది మంది వరదల్లో కొట్టుకుపోయారని, దీనికి ఆయన వైఫల్యమేనని కారణమని మండిపడ్డారు. బాధితులకు నిత్యావసరాలు కూడా అందించలేదని అన్నారు. కార్యక్రమంలో బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కుర్మ హేమలత, మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు అతెల్లి అరుణ శ్రీనివాస్ గౌడ్, నామన శేషకుమారి, అతెల్లి మల్లికార్జున్ గౌడ్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్, బీఆర్ఎస్ డివిజన్ల అధ్యక్షులు అతెల్లి శ్రీనివాస్ గౌడ్, కొలన్ బాల్‌రెడ్డి, ఆకుల హరికృష్ణ, శ్రీనివాస్ గౌడ్, వెంకటేషన్ రాజు, ఉపాధ్యక్షుడు నర్సింగం సతీష్, ప్రధాన కార్యదర్శులు వంజరపు ఆంజనేయులు, మాతంగి గణేష్ నాయకులు తలసాని స్కైలాబ్ యాదవ్, కోటేశ్వర్ గౌడ్, నాగులు, శ్రీహరి, లక్ష్మీపతి, ప్రేమ్ కుమార్, శ్రీఉజ్జయినీ మహాకాళి దేవాలయ మాజీ ధర్మకర్తలు కౌశికె కిషోర్, ఆనంద్ పాటిల్, మహేష్ యాదవ్, అరుణ్ భట్, మహేందర్ తదితర నాయకులు పాల్గొన్నారు.



మర్యాదపూర్వక కలయిక

వడ్డెరలు ఎదుర్కొంటున్న సమస్యలు, రిజర్వేషన్ల కోసం జరుగుతున్న పోరాటంపై వడ్డెర రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు ప్రముఖ న్యాయవాది గంజి సంతోష్ ఆదివారం జస్టిస్ ఈశ్వరయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. వృత్తి కులాల అభ్యున్నతికి ఈశ్వరయ్య చేసిన కృషిని సిఫార్సుల గురించి సంతోష్ కుమార్ తెలుసుకున్నారు. **- అడ్డగుట్ట, ఆంధ్రజ్యోతి**

అక్రమ మద్యం రవాణాపై ఉక్కుపాదం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇతర రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు రవాణా అవుతున్న అక్రమ మద్యంపై ఎక్సైజ్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో రూ.14.50 లక్షల విలువైన 360 బాటిళ్లను సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. తనిఖీల్లో పాల్గొన్న డీటీఎఫ్ ఎక్సైజ్ సీఐ పవన్‌కుమార్‌ను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం, డిప్యూటీ కమిషనర్ దశరథ్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణప్రియ, ప్రవీణ్‌కుమార్‌లు అభినందించారు. స్వాధీనం చేసుకున్న మద్యం గోవా, హరియాణా, లక్నో ప్రాంతాల నుంచి దిగుమతి అవుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

నివాళి



ఆర్ఎస్ఎస్ రాష్ట్ర నాయకులు ఉప్పలంచ అమర్‌నాథ్, మల్లిఖార్జున్‌ల నివాసాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ సందర్శించారు. వారి మాతృమూర్తి తారాబాయి ఇటీవల కన్నుమూసిన నేపథ్యంలో ఆయన పరామర్శించారు. తారాబాయి చిత్రపటానికి పూలమాల వేసి బండి సంజయ్ నివాళులర్పించారు.

- సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి